


నిండు చూలాలు చంచల.

మూడేళ్ళ గోపిగాడు ఒళ్ళో కూర్చొని ఆమె చెబుతున్న కథ వింటున్నాడు. "అప్పు దేమయ్యిందంటే ఆ సూది చెయి జారి నూతిలో పడింది."

"ఊఁ."

"ఊ అంటే వస్తుందా ?"

"రాదు."


"రాదంటే వస్తుందా ?"

"పోమ్మా."

"పోమ్మా అంటే వస్తుందా ?"

"అసల్రాదులే ఫో."

"శభాష్, శభాష్ చంచలా. మొత్తానికి ఆ కథను ఎవరు రాశారోగాని దానికి




ఇమ్మోర్టల్ వేల్యూ ఉందోయ్" అన్నాడు భార్గవ.

"పిల్లల కథలన్నీ శాశ్వత విలువ గలవే," అన్నది చంచల.

"ఎటొచ్చీ పెద్దల కథకే ఆ విలువ లేదంటావ్ ?"

"ఆ మాట నే ననలేదు. ఇంతకీ నా కథ బాగులేదని వ్యంగ్యమా ?"

"నేనో పెద్ద విమర్శకుణ్ణి కాదుగాని, ఆ రాజారావుని అంతలా బలహీనుడిగా చిత్రించడం నచ్చలేదు."

"ఓహో."

"కథ అలా ముగించడంవల్ల పాత కథే అనిపించింది "

"ఇంకెలా ముగిస్తే బాగుండేదో !?"

"ఆ సరస్వతమ్మను తెచ్చి ఇంట్లోనే ఉంచేసుకున్నాడంటే బాగుండేదేమో !"

"ఆమట్న కాంతమ్మ పళ్ళు రాల గొట్టిందని కూడా ఓ ముక్క రాస్తే బాగుంటుందా ?"

"ఎందుకు బాగుంటుంది ? రాజారావు చేసిన తప్పేవిటని, కాంతమ్మకు అంత ఉక్రోషం ?"

"అయ్యో మొద్దు బాబుగారూ ! కథంతా చదివి కూడా తమ రలా అడ్డం తిరుగుతున్నారంటే; అర్థంకాక కాదు లెండి."

"అర్థం కాకపోవడమేవిటి ? పని మనిషి సరస్వతమ్మను అభిమానించాడు రాజారావు. అది కాంతమ్మకు నచ్చలేదు. కాలక్రమేణా కొంగట్టుకు తిరుగుతున్నాడా – అనుకొంది. ఆ తరువాత

రాజారావు ఓ కొంప అద్దెకు తీసి అందులో ఆ సరస్వతిని ఉంచాడని తెలిసి భారంగా నిట్టూర్చింది. ఇందులో అర్థం గాకపోవడాని కేముంది ?"

"అయితే రాజారావు చేసిన పని సమర్థనీయమైన దంటారు ?"

"అలాగని అనడంలేదు. చేసిన తప్పేవి ఒంటాను ?"

"తప్పా; తప్పున్నరా ? మీ పురుషు లంతా ఒకటే గనుక అలా వెనకేసు కొస్తున్నారుగాని, ఎ్రరగా బుర్రగా ఉన్నంత మాత్రాన, తనకంటే పది పదిహేనేళ్ళు పెద్దదే ఆ సరస్వతి; బంగారంలాంటి భార్యను కాదని అలాంటిదాని వెంటబడి వెళ్ళిపోవడమే !? పైగా ఇంట్లోకి కూడా తెచ్చి పెట్టు కుంటాడట ! అదట సబబు !" ఉడుక్కుంది చంచల.

"నీవు కనీసం స్త్రీవై యుండి చేసిం దేవిటి ? సరస్వతిని గురించి కథలో ఏమైనా చెప్పావా ? ఎ్రరగా బుర్రగా ఉండి ఎరచూపించే ఒక నీచురాలన్నావే గాని ఆమె గురించి పూర్వాపరాలు ఏమైనా చెప్పావా ?"

"అది పూర్వం ఓ పదిమందితో తిరిగిందనీ ముందుకి రాజారావుని కాదని మరో నలుగుర్ని ఆదుకొంటుందని కించపరచ లేదంటారు."

"అలాగని అనను. వయసున భర్త కంటే పది పదిహేనేళ్ళు పెద్దదైనా భర్తను వలలో వేసుకోగలిగిన ఆమెలోని ఆకర్షణ, వయసులో ఉన్నప్పుడు ఎంతమందిని ఆకర్షించి ఉంటుందో కనీసం కాంతమ్మ ఊహాగానమైనా చేసుండాలి."

"కాంతానికి పని దండుగ. నాకు పేజీలు దండుగ."

"అలా గనుకునే కథను పాడు జేశావు. నేనొక మాటంటాను. సరస్వతి వయసులో ఉన్నప్పుడు రంభ ! దీపం చుట్టూ పురుగుల్లా అనేకమంది ఆమెను చుట్టుముట్టారు. ఓ పురుగు తటాలున జ్వాలమీద పడింది. జ్వాల ఆరి పోయింది. ఆ పురుగు రెక్కలు దులుపు కొని వెళ్ళిపోయింది. ఆ దీపాన్ని తిరిగి వెలిగించినవారు లేరు – అని కొంచెమైనా సరస్వతి గురించి ఉపోద్ఘాతం చెబితే బాగుండేది."

"ఏ రాయైతే, పళ్ళూడగొట్టుకోవ డానికి ? చివరి కది ఆరిపోయిన దీపమేగా ? ఇప్పుడు కొంపలార్పడమే దాని పని అంటే చాలు."

"కాంతమ్మకు బుద్ధి లేదు."

"ఏం కాంతమ్మేం జేసింది ?"

"మానవుల మన స్తత్వాన్ని ప్రతి బింబింప జేయవలసిన రచయిత్రి అయి ఉండి స్వార్థం అడ్డొచ్చేసరికి సామాన్య మానవురాలిగా వ్యవహరించింది."

"కాంతమ్మ రచయిత్రి అని నేను రాయలేదే ?"

"కడుపుతో ఉందని కూడా రాయలేదు."

"అయితే అసలు విషయం గ్రహించేనా ఇన్ని కబుర్లు ?"

"తెలుసు, నీ కథలో రాజారావును నేనని. సరస్వతి అన్నపూర్ణనీ తెలుసు."

"అయితే మీరు దాన్ని ఇంట్లోకే తెచ్చి పెట్టాలనుకుంటున్నారన్నమాట!"

"నీవు పశ్చాద గొట్టను-అంటే."

"తెగించినవాడికి తెడ్డే లింగం."

"అలాగని కాదు. కడుపుతో ఉన్నావుగా ? నీకు చేదోడువాదోడుగా ఉంటుంది. గోపిగాణ్ణి ఆడిస్తుంది. నా ఆలనా పాలనా చూసుకుంటుంది."

"ఏమండీ ! ఆపండి." పొలికేక పెట్టింది చంచల.

"చంచలా; అన్నపూర్ణకీ నాకూ ఉన్న సంబంధం ఈనాటిది కాదు, చిన్ననాటిది. నీవనుకున్నట్టు ఆమెకూ నాకూ ఉన్న వయసు వ్యత్యాసం ఎక్కువే. అందుకనే ఆమె నన్ను పసివాడుగా ఎత్తుకొని ఆడించింది. ఆమె నన్ను ఏడేళ్లదాకా పెంచింది. ఆమె అందమే ఆమెను బలిగొన్నది. ఎవణ్ణో నమ్మింది. ఎటో పోయింది. మోసపోయింది. అభిమాని. తిరిగి రాలేదు. పంచలెంట ఉంటూ ఇంటింటా చాకిరీ చేస్తూ బ్రతుకుతోంది. పనిమనిషికోసం వెతుకుతుంటే తటస్థపడింది. ఆమె మెడ మీద పుట్టుమచ్చ ఉంది చూశావూ ? అది గుర్తుచేసింది - అన్నపూర్ణ ! నీ అక్కయ్ !! - అని."

"ఏమండీ !?"

"ఏమండీ అంటే ఆమె నీ అక్క కాదా ?"

"నిజం చెప్పండి."

"నిజం చెప్పండి అంటే, ఆమె నీ అక్క కాదా ?"

"అబ్బ, విసిగించకండి."

"అబ్బ విసిగించకండి అంటే ఆమె నీ అక్కకాదా ?"

"ఎందుక్కాదు ? ఆమెను వెంటనే ఇంటికి రమ్మని ఆహ్వానించండి."

"రేయ్ గోపీ ! సూది బయటికొచ్చిందొరేయ్ !" అని గోపీని ఎత్తి ముద్దాడాడు భార్గవ.